సాక్షి
సంగారెడ్డి
గురువారం । 8 । ఆగస్టు । 2024



మెరిసిన చేనేత పద్మాలు
చేనేత కార్మికుల వృత్తి నైపుణ్యాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. గొల్లభామ, రామప్ప చీరలకు అవార్డులు వరించాయి.
వివరాలు 8లో ▸



మంజీరా తీరం.. పచ్చలహారం
మంజీరా తీరం పచ్చలహారంగా కనిపిస్తోంది. తీరం వెంబడి జోరుగా సాగు పనులు మొదలు పెట్టారు.
వివరాలు 8లో ▸



నామినేటెడ్‌పై ఆశలు
జోగిపేట, వట్‌పల్లి, రాయికోడ్ మార్కెట్ కమిటీల నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగొద్దు

- ధూమపానం చేస్తే జరిమానా, జైలుశిక్ష
- పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరిక



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

హత్నూర (సంగారెడ్డి): బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమని, అతిక్రమించిన వారికి జరిమానాతో పాటు 2 ఏళ్ల జైలుశిక్ష తప్పదని పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్ బస్టాండ్ చౌరస్తా ప్రదేశాలలో ధూమపానం చేస్తున్న వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు ఉత్పత్తులు, ప్రచారంపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం చట్ట విరుద్ధమన్నారు. విద్యాలయాల వద్ద 100 మీటర్ల వరకు పొగా తాగడం, ఉత్పత్తుల అమ్మకం నిషేధమన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారికి జరిమానాతో పాటు రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్ల లోపు వారికి పొగాకు వస్తువులు అమ్మరాదన్నారు.

కాలేజీలో చేరేందుకు ఏర్పాట్లు..

- అంతలోనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి



ఆర్తి(ఫైల్)

జోగిపేట(అందోల్): అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందిన సంఘటన పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన సంతోష్ జైన్ కూతురు ఆర్తి (18). ఆమె గతేడాది సంగారెడ్డి సెయింట్ అంథోనీ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. కాలేజీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటుంది. కాగా, బుధవారం రాత్రి భోజనం చేయాలని పిలిచేందుకు సోదరి వెళ్లింది. ఈమె ఎంతసేపు తలుపులు కొట్టినా తీయలేదు. ఈ విషయాన్ని తండ్రికి వెళ్లి చెప్పింది. ఆయన వెళ్లి తలుపులు గట్టిగా నెట్టడంతో తెరచుకోగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని విగతజీవిగా ఆర్తి కనిపించింది. తండ్రి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ పాండు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని అంటున్నారు. అయితే 10 రోజుల క్రితమే ల్యాప్ ట్యాప్ కూడా కొనిచ్చానని, కళాశాలలో చేరేందుకు అవసరమైన రూ.60వేల నగదును కూడా ఆమె దగ్గరనే పెట్టానని, ఇటీవలే బ్యాంకు రుణం కోసం కూతురుతో కలిసి వెళ్లినట్లు తండ్రి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త పడేసిన వ్యక్తికి జరిమానా

సంగారెడ్డి : పట్టణంలో స్వచ్ఛదనం పచ్చదనం నిర్వహిస్తుంటే బుధవారం ఓ వ్యక్తి తన ఇంట్లోని చెత్తను తీసుకొచ్చి బయటపడేశాడు. ట్రైనీ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ అధికారులు.. అతడిని పట్టుకున్నారు. రూ. 10 వేల జరిమానా వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలెవరూ చెత్త బయట వేయకూడదని సూచించారు. చెత్త వాహనంలోనే వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహన్, డీఈ ఇంతియాజ్ అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు, హెల్త్ అసిస్టెంట్ విజయబాబు పాల్గొన్నారు.

సింగూరు.. ఏదీ నీరు?

ప్రాజెక్టు నిండుతలే..

- మహారాష్ట్ర, కర్ణాటకల్లో వానల్లేక..
- ఈ వర్షాకాలం రెండు నెలల్లో కలిపి ఇన్‌ఫ్లో ఒక టీఎంసీనే..
- గతేడాది ఇదే సమయానికి జలకళ
- నిజాంసాగర్ ప్రాజెక్టు, ఘనపురం ఆయకట్టుకు ఇదే ఆధారం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : హైదరాబాద్ జంట నగరాలకు తాగు నీరు, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు సాగు నీరు అందించే సింగూరు ప్రాజెక్టు ఇప్పుడు వెలవెలబోతోంది. రాష్ట్రంలో అన్ని సాగునీటి ప్రాజెక్టులు నిండుకుండలా మాదిరిగా మారి.. గేట్లు ఎత్తుతుంటుంటే.. ఈ ప్రాజెక్టు మాత్రం బోసిపోయింది. వర్షా కాలం ప్రారంభమై 2 నెలలు దాటినప్పటికీ.. ప్రాజెక్టు సగం కూడా నిండకపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ప్రాజెక్టు కింద ఉంద ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు, ఘనపురం ఆనకట్ట కింద ఉన్న ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారే అవకాశాలున్నాయి.

గత ఏడాది అప్పటికే నిండింది..

☛ సింగూరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 523.600 అడుగులు (29.917 టీఎంసీలు). ప్రస్తుతం 519.930 అడుగుల (14.712 టీఎంసీలు) వరకు నీళ్లున్నాయి. గత ఏడాది ఈ ప్రాజెక్టు నీటిమట్టాన్ని పరిశీలిస్తే.. 2023 ఆగస్టు 7న ఈ 523.145 అడుగులు (27.369 టీఎంసీలు) నీళ్లు ఉన్నాయి.

☛ గత ఏడాది అప్పటికే ఈ ప్రాజెక్టు ద్వారా జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి ఆగస్టు మొదటి వారం వరకు కొనసాగించింది. రోజూ సుమారు మూడు వేల క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి కోసం విడుదల చేశారు. కానీ ఈసారి పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. 2015, 2019 సంవత్సరాల్లోనూ ప్రాజెక్టు పరిస్థితి ఇలాగే ఉందని అధికారులు పేర్కొన్నారు.


క్యాచ్‌మెంట్ ఏరియాలో కరవు ఛాయలు..

సింగూరు ప్రాజెక్టుకు క్యాచ్‌మెంట్ ఏరియా మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఎక్కువగా ఉంటుంది. మహారాష్ట్రలోని బీడ్, ఉస్మానాబాద్, లాతూర్, అహ్మద్‌నగర్ జిల్లాల్లో క్యాచ్‌మెంట్ ఎక్కువగా క్యాచ్‌మెంట్ ఏరియా ఉంది. ఈ ప్రాంతంలో ఆశించిన మేరకు వర్షాలు కురియలేదు. దీంతో ఈ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెద్దగా రాలేదు.

☛ కర్ణాటకలోని బీదర్, బాల్కీ జిల్లాల్లోనూ కొంత భాగం, సంగారెడ్డి జిల్లా పరిధిలోని న్యాల్‌కల్, వట్‌పల్లి, మనూరు, రాయ్‌కోడ్, నాగిల్‌గిద్ద, మునిపల్లి, ఝరాసంఘం మండలాల్లో అతి కొంత క్యాచ్‌మెంట్ ఏరియా ఉంటుంది. కర్ణాటకలో జిల్లాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉండటంతో వరద జలాలు రాలేదు. దీంతో ఈ ప్రాజెక్టు వెలవెలబోతోందని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రెండు నెలల్లో ఒక్క టీఎంసీనే..

ఈ ప్రాజెక్టుకు ఈ వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ కేవలం ఒక్క టీఎంసీ మాత్రమే ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులోకి నామమాత్రంగా 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉంది. ప్రస్తుతం మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు, హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ కు 80 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



సింగూరు ప్రాజెక్టు (ఫైల్)

☛ ఈ ప్రాజెక్టు ఆలస్యంగా సెప్టెంబర్‌లో నిండిన రోజులు కూడా ఉన్నాయి. 2016, 2017, 2018, 2020 సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టులోకి సెప్టెంబర్ నెలల్లో భారీగా ఇన్‌ఫ్లోలు వచ్చి చేరడంతో నిండిందని అధికారులు చెబుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ వరకు ఇంకా మూడు నెలలు సమయం ఉందని, ఈ మూడు నెలల్లో క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడుతాయనే ఆశాభావంతో ఉన్నారు.

☛ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఆయకట్టు ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఈ సింగూరు నుంచి ఏటా 8 టీఎంసీలు విడుదల చేస్తుంటారు. అలాగే మెదక్ జిల్లాలో ఘనపురం ఆయకట్టుకు 4 టీఎంసీలు విడుదల చేస్తుంటారు. రానున్న 3 నెలల్లో వర్షాలు కురియకపోతే ఈ ప్రాజెక్టులకు నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారనుంది. అయితే తాగునీటి అవసరాలకు ఏ మాత్రం ఢోకాలేదని అధికారులు చెబుతున్నారు.

చేనేత దుస్తులనే ధరించాలి

కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి: ప్రతీఒక్కరు చేనేత వస్త్రాలను ధరించాలని, యువత వారసత్వ సంపదతోపాటు చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ వీ క్రాంతి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డి ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో జిల్లా అధికారులు, చేనేత కార్మికులుతో కలిసి కలెక్టర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ రంగ కార్మికులకు ప్రభుత్వం చేయూతనందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. పవర్ లూమ్ కంటే చేతితో చేసే హ్యాండ్లూమ్ ఎంతో గొప్పదన్నారు. గద్వాల చేనేత చీరలంటే ఎంతో ఖ్యాతి ఉందన్నారు. ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం చేనేత కార్మికుల నైపుణ్యం ప్రజలకు చాటి చెబుతూ ప్రతీఒక్కరు చీరలను ధరించేటట్లు ప్రోత్సహించాలన్నారు. ఆ వస్తువులు ఆదరణ తగ్గకుండా ప్రోత్సాహాన్ని అందిస్తామని, రాబోయే తరానికి వాటి వినియోగంపై మక్కువను పెంపొందించడమే ఈ రంగానికి ఇచ్చే బహుమానమన్నారు. జిల్లా యంత్రాంగం వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు, చేనేత జౌళి శాఖ అధికారి వెంకటరావు, చేనేత, ఉన్నిచేనేత సహకార సంఘాలు నారాయణఖేడ్, జోగిపేట సంఘం చైర్మన్ రొడ్డె కృష్ణ, పర్కల అశోక్, సభ్యులు, జిల్లా అధికారులు, చేనేత కార్మికులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి: హ్యాండ్లూమ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

సదాశివపేట(సంగారెడ్డి): పరిసరాల పరిశుభ్రతతోనే వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కలెక్టర్ వీ క్రాంతి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా.. ఆమె మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ వరకు గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలందరూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఇంట్లోని తడిపొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ పంచాయతీ వాహనాల్లో వేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలో డంపింగ్ ఏర్పాటుకు స్థల సేకరణ జరపాలని కమిషనర్ ఉమను ఆదేశించారు. అనంతరం కేజీబీవీని సందర్శించి భోజన మెనూ పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి ఆమె భోజనం చేశారు. విద్యాబోధన గురించి ఆరా తీశారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, దానికి కారణం ఏమిటని అధ్యాపకులను అడిగారు. హాస్టల్ వసతి ఏర్పాటు చేస్తే సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం 7వ వార్డులోని వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రికి వెళ్లి వార్డులను, కేసు షీట్లను పరిశీలించారు. ఇక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలపై రోగులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఇక్కడి నుంచి మినీట్యాంక్‌బండ్, ఊబచెరువు కట్టను పరిశీలన చేశారు. కట్టను తవ్వి నిబంధనలకు విరుద్ధంగా వేసిన వెంచర్‌ను పరిశీలించి దీనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట డీఎంహెచ్ఓ గాయత్రి, డీఈఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఉమ, తహసీల్దార్ సరస్వతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సదాశివపేట(సంగారెడ్డి): కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

- పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ
- పలు గ్రామాల్లో పర్యటన
- రాయికోడ్‌లో డంపింగ్ యార్డుల నిర్వహణపై ఆగ్రహం



న్యాల్‌కల్(జహీరాబాద్): మిర్జాపూర్(బి)లో మొక్కలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ

న్యాల్‌కల్(జహీరాబాద్): అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని మిర్జాపూర్(బి), గంగ్వార్ గ్రామాల్లో పర్యటించారు. డంప్‌యార్డులు, పల్లె ప్రకృతివనాలు, మురుగు నిర్వహణ పరిశీలించారు. మిర్జాపూర్(బి)లో డంప్‌యార్డు, మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల కొంత అసంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమస్య చిన్నదే అయినప్పటికీ దాని వల్ల ఎంతో మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని గమనించాలన్నారు. కష్టపడి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. గ్రామానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శులు కలిగి ఉండాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను విరివిగా పెంచాలని, వాటిని పాడవకుండా చూడాలన్నారు. ఆయన వెంట జహీరాబాద్ డీఎల్‌పీఓ అమృత, ఎంపీడీఓ సురేష్, ఏపీఓ రంగారావు ఉన్నారు.

రాయికోడ్ మండలంలో..

రాయికోడ్(అందోల్): మండలంలోని నల్లంపల్లి, మహమ్మదాపూర్, పీపడ్‌పల్లి గ్రామాల్లో పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని డంప్ యార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేయకపోవడం, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించక పోవడంపై పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి గ్రామాలను సందర్శిస్తానని కార్యదర్శుల పనితీరులో మార్పు రాకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. డంప్ యార్డుల్లో విధిగా కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. అలాగే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాల నిర్వహణపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం నర్సరీల్లో మొక్కలను పరిశీలించి నాటిన వాటి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్, డీఎల్‌పీఓ అమృత, ఎంపీఓ అంజలిదేవి, ఏపీఓ రమేశ్‌కుమార్, ఈసీ విష్ణువర్ధన్, టీఏలు మురళీపాటిల్, తుక్కప్ప, కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పచ్చదనాన్ని పెంచాలి

- జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంచడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సూచించారు. బుధవారం మండలంలోని తొగర్‌పల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పరిశుభ్రత, డంపింగ్ యార్డు, మురుగు కాలువలు వంటి వాటిని పరిశీలించారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతమిచ్చి లక్ష్యం మేర మొక్కలు నాటి స్వచ్ఛతకు పాటు పడాలని తెలిపారు. సాయిబాబా మొదటిసారిగా గ్రామానికి విచ్చేసిన సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి ప్రదీప్ సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు కృషి చేయాలి

ఝరాసంగం(జహీరాబాద్): మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ జానకీరెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు కుప్పానగర్ గ్రామాలను ఆయన సందర్శించారు. అలాగే ఝరాసంగం శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయంలో పార్వతి పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ ఎంపీఓ రాజ్ కుమార్, ఏపీఎం బాలకృష్ణ, ఆయ గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీమాతో ధీమా

- ఈనెల 15 వరకు ప్రత్యేక మేళాలు
- సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ మురళీకుమార్



సంగారెడ్డి: తపాలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్‌తో ప్రజలకు రక్షణ ఉంటుందని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్వీ మురళీకుమార్ అన్నారు. ఈనెల 15 వరకు 'సురక్ష ఆజాది కాంటెస్ట్' కొనసాగుతోందని, అర్హులైన ప్రతీ ఒక్కరు ప్రమాద బీమా పాలసీని తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. సంగారెడ్డి డివిజన్ పరిధిలోని అన్ని పోస్ట్ ఆఫీస్‌లలో ప్రత్యేక మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాద బీమా పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీలు సేకరిస్తున్నామని చెప్పారు. ఇందులో వార్షిక ప్రీమియం రూ.520, రూ.555, రూ.549, రూ.559, రూ.699 చెల్లిస్తే 10 లక్షల బీమా ఉందన్నారు. అలాగే వార్షిక ప్రీమియం రూ.755, రూ.749, రూ.799 చెల్లిస్తే 15 లక్షల ఇన్సూరెన్స్ ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబానికి భరోసా కల్పించే ఇటువంటి మంచి పథకాలను ప్రజలు ఆలస్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనిలో భాగంగానే సంవత్సర వార్షిక ప్రీమియం 2,850 చెల్లిస్తే 50 లక్షలు ఇన్సూరెన్స్ ఉంటుందని తెలిపారు. ఒకసారి వార్షిక ప్రీమియం చెల్లిస్తే సంవత్సరం వరకు రిస్క్ బీమా కవరేజీ ఉంటుందని వివరించారు. అలాగే సేవలను మరింత ప్రజలకు చేరువ కావడానికి తపాలా సేవల సమీకృత సమ్మేళనం (డీసీడీపీ) కార్యక్రమాలను డివిజన్ పరిధిలో నిర్వహిస్తుమన్నారు.

పడకేసిన ప్రగతి

- అభివృద్ధికి ఆమడదూరంలో విలీన గ్రామాలు
- వేధిస్తున్న మౌలిక సదుపాయాల కొరత
- పంచాయతీలుగా ఉన్నప్పుడే నయం అంటున్న ప్రజలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలు అభివృద్ధికి నోచడంలేదు. మున్సిపల్‌కు కౌన్సిల్ లేక సమస్యల గురించి అడిగేవారు కరువయ్యారు. దీంతో అధికారులు పెద్దగా పట్టించుకోవడంలేదు. దీంతో తమ గ్రామాల్లో ప్రగతి పడకేసిందని ప్రజలు వాపోతున్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న రంజోల్, పస్తాపూర్, అల్లీపూర్, చిన్న హైదరాబాద్‌తో పాటు హోతి(కె)లను ఐదారు సంవత్సరాల క్రితం మున్సిపాలిటీలో విలీనం చేశారు. అప్పటి నుంచి మున్సిపల్‌కు ఎన్నికలు నిర్వహించలేదు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లో హోతి(కె) గ్రామస్తులు కోర్టుకు వెళ్లారు. దీంతో మున్సిపల్‌కు జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడ్డాయి. కోర్టు స్టే ఎత్తివేసినా ఎలక్షన్ నిర్వహించడం లేదు. అధికారులే అభివృద్ధి పనులు చూసుకుంటున్నారు. పాలక మండలి లేనందునా ఆశించిన మేరకు ప్రగతి పనులు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయడం, నీటిని సరఫరా తప్ప చెప్పుకొదగ్గ అభివృద్ధి లేదని, సమస్య గురించి ఎవరికి చెప్పాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడే బాగుడేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ప్రధాన సమస్యలు

జహీరాబాద్ మున్సిపల్‌లో విలీనమైన అల్లీపూర్‌లో సరైనా అభివృద్ధి పనులు చేపట్టలేదు. పంచాయతీ పరిధిలోని పలు కాలనీలు పట్టణంలో కలిసి ఉన్నాయి. అయినా సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేక పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. అవసరం మేర మురుగు కాలువలు, సీసీ రోడ్ల పనులు జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు.

- పస్తాపూర్ గ్రామం పంచాయతీలోని మహీంద్ర కాలనీ, వసుంధర, ఆనంద్ నగర్ తదితర కాలనీల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. డ్రైన్‌లు లేక నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఆయా వీధుల్లో కాలినడకన వెళ్లడం కూడా కష్టతరంగా మారింది. టౌన్‌లో కలిసిన ప్రధాన కాలనీల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది.
- జాతీయ రహదారిపై ఉన్న రంజోల్‌లోనూ ఆశించిన మేర అభివృద్ధి జరగడం లేదు. ప్రధాన రహదారిలో వీధి దీపాలనే ఏర్పాటు చేసి, పాలిటెక్నిక్ రోడ్డు, మెయిన్ రోడ్డులో మురుగు కాలువలను నిర్మించారు. కానీ గ్రామం గురించి పట్టించుకోవడం లేదని, డ్రైనేజీలు, సీసీ రోడ్లు వేయడం లేదని ప్రజలు విచారం వ్యక్తం చేశారు.
- జహీరాబాద్ పట్టణానికి దూరంగా ఉన్న హోతి(కె), చిన్న హైదరాబాద్ పంచాయతీల్లో ఇంకా పల్లెటూర్ వాతావరణం కనిపిస్తోంది. మున్సిపల్‌లో విలీనమైన తరువాత అభివృద్ధి ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పరిస్థితి ఉంది. ప్రధానంగా సీసీ రోడ్లు, మురుగు కాలువలు, నీటి సమస్యలు గ్రామ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు విలీన గ్రామాలపై దృష్టి పెట్టి పట్టణంతో పాటు ప్రగతి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సాయిరాం నగర్ కాలనీలో అధ్వానంగా తయారైన ప్రధాన రోడ్డు

దృష్టి పెట్టాం



ఇటీవలే తాను పదవీ బాధ్యతలను తీసుకున్నా. విలీన గ్రామ పంచాయతీలపై దృష్టి పెట్టాం. రోజూ పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నాం. వర్షాకాలం సీజనల్ వాధ్యులు రాకుండా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. కార్మికులను కేటాయించి ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు, మురుగు కాలువలను శుభ్రపరచడం తదితర పనులు చేయిస్తున్నాం. ఏమైనా సమస్యలుంటే ప్రజలు మా దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

పక్షం రోజుల్లోనే చెరకు బిల్లు

- గోదావరి- గంగా చక్కెర కర్మాగారం ఎండీ సచిన్ గోయల్
- కూలీలు, రవాణా బాధ్యతలు తీసుకుంటామని హామీ



సచిన్ గోయల్‌ను సత్కరిస్తున్న నాగిరెడ్డిపల్లి రైతులు

జహీరాబాద్: వచ్చే క్రషింగ్ సీజన్‌కు గాను రైతులు చెరకును సరఫరా చేసిన పక్షం రోజుల్లోనే బిల్లులను చెల్లిస్తామని మాటూర్‌లోని గోదావరి–గంగా చక్కెర కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్ సచిన్ గోయల్ అన్నారు. బుధవారం కోహీర్ మండలం పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి, మదిరి గ్రామాల చెరకు రైతులతో కలిసి ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పలు అనుమానాలను రేకెత్తించారు. చెరకు ధర ఎంత మేర చెల్లిస్తారని, సరఫరా చేసిన అనంతరం ఎన్ని రోజుల్లో బిల్లులు చెల్లిస్తారని అడిగారు. కోత కోసేందుకు వచ్చే కూలీలు పెట్టే డిమాండ్లను రైతులు తీర్చలేని విధంగా ఉంటున్నాయని, జల్సా కింద మేకలు, కట్నం అడుగుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ పంట కోతకు వచ్చే కూలీలకు నయా పైసా చెల్లించనక్కర లేదన్నారు. కోత నుంచి రవాణా వరకు అంతా తామే చూసుకుంటామని హామీనిచ్చారు. బిల్లులలో నుంచి కూలీలు, రవాణా ఖర్చులు మినహాయించుకుని మిగతా బిల్లులు పక్షం రోజుల్లో రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. చెరకు ధర విషయమై వివరిస్తూ రాష్ట్రంలో ఏ కర్మాగారం అత్యధిక ధరను చెల్లిస్తే దాన్ని పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. కోత కోసం ఇప్పటికే 80 కూలీల గ్యాంగ్‌లను సమకూర్చామని, అయితే కాకుండా యంత్రాలను సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న చెరకు విత్తనాన్ని మార్చుకుని కొత్త విత్తనాన్ని నాటుకోవాలని సూచించారు. ఇందు కోసం తాము టిష్యూ విధానంలో నారును తయారు చేసి అందిస్తామన్నారు. చెరకు విత్తనం కోసం ఎకరాకు రూ.7వేల వంతున లోన్ సదుపాయం కల్పిస్తామన్నారు. రైతులు చేసిన అగ్రిమెంట్ ప్రకారం చెరకును తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

రైల్వే బ్రిడ్జి నిర్మించాలి

- కేంద్ర మంత్రికి ఎంపీ రఘునందన్‌రావు వినతి



రైల్వేమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌జోన్/చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మెదక్ రోడ్డు రైల్వే గేటు వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ రఘునందన్‌రావు వినతిపత్రం అందించినట్లు దుబ్బాక నియోజకవర్గ కో కన్వీనర్ గోవింద్ తెలిపారు. బుధవారం ఢిల్లీలోని రైల్వే మంత్రిని రఘునందన్‌రావు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తోపాటు కలిశారు. సర్వే పూర్తి చేసిన తెల్లాపూర్ సిద్దిపేట రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని కోరారు. చేగుంట శివారులోని రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మించాలని కోరినట్లు పేర్కొన్నారు. అలాగే, తెల్లపూర్ నుంచి సిద్దిపేట వరకు సర్వే పూర్తయిన రైల్వే లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.

అంబులెన్స్‌ను చోరీ చేసి తీసుకెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో దొంగకు గాయాలు, దెబ్బతిన్న వాహనం



ప్రమాదస్థలంలో నుజ్జునుజ్జయిన వాహనం

కొండపాక(గజ్వేల్): ప్రైవేటు అంబులెన్సు వాహనాన్ని చోరీ చేసిన వ్యక్తి అడ్డంగా దొరికిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. కొండపాక గ్రామానికి చెందిన నవీన్ సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అంబులెన్సును అద్దెకు పెట్టుకున్నాడు. ఆస్పత్రి ఎదుట వాహనాన్ని నిలిపి తాళం చెవి వాహనానికే పెట్టి లోపలికి వెళ్లాడు. దీన్ని గమనించిన అశోక్ అంబులెన్సు వాహనాన్ని దొంగిలించి హైదరాబాద్ వైపునకు వెళ్తూ దుద్దెడ శివారులో టోల్ ప్లాజాను గుర్తించాడు. మళ్లీ వాహనాన్ని యూటర్న్ చేసుకొని సిద్దిపేట వైపునకు అతి వేగంగా వెళ్తున్నాడు. దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని వాహనం ఆగిపోయింది. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్ దెబ్బతింది. చోరీకి యత్నించిన వ్యక్తి మద్దూరు మండలంలోని రేభర్తి గ్రామవాసిగా గుర్తించారు. దుద్దెడ శివారులో అంబులెన్స్ వాహనాన్ని పట్టుకోగా చోరీకి గురైంది సిద్దిపేట వన్ టౌన్ పరిధిలోకి రావడంతో కేసును అక్కడికి తరలించినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి కానిస్టేబుల్ మృతి

- నివాళులర్పించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



దుర్గపతి (ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్) : బైక్‌పై నుంచి పడి తీవ్ర గాయాలతో కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ఫరీద్‌పూర్ తండాకు చెందిన బానోత్ దుర్గపతి(50) మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం స్వగ్రామం నుంచి స్టేషన్‌కు బైక్‌పై వెళ్తుండగా కూచన్‌పల్లి గ్రామ శివారులోకి రాగానే కుక్కను తప్పించబోయి రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. దుర్గపతి మృతిపై మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు మురళీ, సత్యనారాయణ, పోలీసు సిబ్బంది సంతాపం ప్రకటించారు. అలాగే ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఫరీద్‌పూర్ తండాకు వెళ్లిన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పోలీసుశాఖ తరఫున ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీనిచ్చారు.



మంజీరా నది పరీవాహకం



వరి నాట్లు వేస్తున్న రైతులు

మంజీరా తీరం.. పచ్చలహారం

మంజీరా తీరం పచ్చలహారంగా కనిపిస్తుంది. వర్షాభావ పరిస్థితుల్లో కూడా నీరు లభ్యమవుతుండటంతో రైతులు తీరం వెంబడి మోటార్లు బిగించి పంటలు పండిస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు నుంచి నిజాం సాగర్ ప్రాజెక్టుకు, ఘనపూర్ ఆయకట్టుకు నీటి విడుదల చేస్తారు. అలాగే, మంజీరా బ్యారేజ్ ద్వారా జంట నగరాల తాగు నీటికి నిరంతరం నీళ్లు అవసరం కావడంతో సింగూరు నుంచి నీటి వదులుతారు. ఈ క్రమంలో మంజీరా పరివాహకం ఎప్పుడూ నీటితో జలకళ సంతరించుకుంటుంది. నీళ్లు పుష్కలంగా ఉండటంతో రైతులు జోరుగా సాగు పనులు మొదలు పెట్టారు.

– పుల్‌కల్(అందోల్)

- నది చుట్టుపక్కల పెరిగిన సాగు
- మోటార్‌లను బిగింపు పైపులైన్‌లతో పంటలకు నీళ్లు
- వర్షాభావంలోనూ తగ్గని నీటి ప్రవాహం
- సంగారెడ్డి, మెదక్ జిల్లాలో 105 కిలోమీటర్ల మేర ప్రవాహం
- సింగూరు ప్రాజెక్ట్ నుంచి నిరంతరం నీరు విడుదల

గోదావరికి ఉపనది అయిన మంజీరా సంగారెడ్డి, మెదక్ జిల్లాలో 105 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. మంజీరా నదిపై 1976లో సింగూరు ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి, 1988 నుంచి దశల వారీగా నీటిని నిల్వ చేస్తున్నారు. 30 టీఎంసీల సామర్థ్యం గల డ్యాం నుంచి దిగువన ఉన్న నిజాంసాగర్, ఘనపూర్ ఆయకట్టకు సాగునీటిని, మంజీరా బ్యారేజ్‌లోకి తాగునీటిని దశల వారీగా విడుదల చేస్తుండటంతో మంజీరా నది ఎప్పుడూ జీవకళను సంతరించుకుంటుంది.

తీరం వెంబడి సాగు సందడి..

తీరం వెంబడి డ్యామ్‌కు ఎగువభాగంలో నారాయణఖేడ్ ప్రాంతంలోని మండలాలు, డ్యామ్‌కు దిగువన సింగూరు నుంచి నిజామాబాద్ వరకు వేల మోటార్లు బిగించి లక్షల ఎకరాల్లో సాగు చేసుకుంటున్నారు. మోటార్లతోపాటు సింగూరు కుడి, ఎడమ కాల్వల ద్వారా 40 వేల ఎకరాలు, అందోల్ నియోజకవర్గంలోని చెరువుల కింద 10 వేల ఎకరాలు, ఘనపూర్ ఆయకట్టు కింద లక్ష ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు.

తీరం సుభిక్షం..

మంజీరా నది పరీవాహకంలో వర్షాభావ పరిస్థితుల్లో కూడా సాగు, తాగు నీటికి ఢోకా ఉండదు. రైతులు మోటార్లు పెట్టి మంజీరా నదిలో నుంచి సాగునీటిని వాడుకొని పంటలు పండిస్తున్నారు.

మంజీరా నది తీరంలో ఉన్న భూముల విలువ ఎక్కువ. దీంతో కొందరు మంజీరా నది తీరం వెంబడి భూములు కొని ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కూడా తీరం భూముల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. నీరు సమృద్ధిగా ఉండటంతో వరి పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. పదేళ్లగా ప్రభుత్వాలు సాగుకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రైతులు ఇబ్బడి ముబ్బడిగా పంటలు పండిస్తున్నారు.


పరీవాహకంపై రైతుల మక్కువ



మంజీరా నది తీర ప్రాంతంలోని భూముల్లో వర్షాభావ పరిస్థితుల్లో కూడా వ్యవసాయం చేయొచ్చు. సాగునీటికి ఢోకా ఉండదు. రైతులు పెద్ద పెద్ద మోటార్‌లను బిగించి సాగు చేస్తున్నారు. మంజీరా నది తీరానికి దూరంగా ఉన్న భూముల్లోని రైతులు కూడా పైపులైన్ వేసి సాగు చేసుకుంటున్నారు.

– కలాలి మల్లేశం గౌడ్, రైతు, ముదిమాణిక్యం

సింగూరు ప్రధానం..



సంగారెడ్డి, మెదక్ జిల్లాల తాగు, సాగునీటికి సింగూరు ప్రాజెక్టు ప్రధాన భూమిక పోషిస్తుంది. 30 టీఎంసీల సామర్థ్యం గల సింగూరు ప్రాజెక్టు నుంచి పది నియోజకవర్గాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తారు. మిషన్ భగీరథకు 17 టీఎంసీల వరకు నీటిని వినియోగిస్తున్నారు. మిగితా నీటిలో సింగూరు ఆయకట్టుకు 4 టీఎంసీలు, ఘనపూర్ ఆయకట్టుకు 4 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటికి 4 టీఎంసీలను కేటాయించారు.

మెరిసిన చేనేత పద్మాలు

- సిద్దిపేట నేతన్నలకు గుర్తింపు
- గొల్లభామ, రామప్ప చీరెలకు చోటు
- రాష్ట్ర స్థాయిలో అవార్డులు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా స్వీకారం



లక్ష్మయ్య, శ్రీరాములను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సిద్దిపేటజోన్: సిద్దిపేట చేనేత కార్మికుల అద్భుతమైన వృత్తి నైపుణ్యాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన సిద్దిపేట బ్రాండ్ అంబాసిడర్ గొల్లభామ చీరకు వరుసగా ఏడు సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయి అవార్డు దక్కించుకుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి చేనేత కార్మికుల ప్రతిభాపాటవాల్ని గుర్తించి కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారక అవార్డుల పేరిట సత్కరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర కమిషనర్ శైలజా రామయ్యర్ చేతుల మీద అవార్డులు అందుకున్నారు. నగదు పురస్కారం, మెమోంటో, ప్రశంసాపత్రంతో సిద్దిపేటకు చెందిన సిరిగాది లక్ష్మయ్య, బుగ్గ శ్రీరాములును ప్రభుత్వం ఘనంగా సన్మానించింది.

చేనేత కార్మికుల వృత్తి నైపుణ్యాలను గుర్తించి, వారిలో చేనేతపై ఉత్సాహం నింపే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అవార్డులు అందజేస్తుంది. గతంలో సిద్దిపేట బ్రాండ్ అంబాసిడర్ గొల్లభామ చీరతోపాటు సంప్రదాయ పీతంబర పట్టు చీరలకు పురస్కారాలు లభించాయి. ఈ క్రమంలో ఈసారి సిద్దిపేట ఆదర్శ చేనేత సొసైటీలో నేత కార్మికుడు సిరిగాది నర్సయ్య పట్టుదారంతో గొల్లభామ ప్రతిమలతోపాటు చెక్ ప్యాట్రన్ పద్ధతిలో బార్డర్‌లో ట్రెడిషనల్ గొల్లభామ బొమ్మలతో నేసిన చీరకు అవార్డు లభించింది. అదే విధంగా ఇర్కోడ్ చేనేత సొసైటీకి చెందిన బుగ్గ శ్రీరాములు తేలికగా మగువల అభిరుచికి తగ్గట్టుగా నేసిన యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప కాటన్ చీర రాష్ట్ర స్థాయి అవార్డు సొంతం చేసుకుంది.

కష్టానికి తగిన ఫలం



అవార్డు పొందిన చీరతో..

నలభై ఏళ్ల చేనేత పనితనానికి ఇది గుర్తింపు. పేదరికంలో పుట్టి కుల వృత్తిపై ఆధారపడిన మా తండ్రి నుంచి నేర్చుకున్న. గొల్లభామ చీరలు తయారు చేయాలని అనుకున్న. జకార్డు మగ్గం మీద నాలుగు రోజులు కష్టపడి గొల్లభామ పట్టు చీర నేసిన, దానికి ప్రభుత్వ గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ప్రోత్సాహమందిస్తే ఇంకా అద్భుతమైన చీరలను తయారీ చేస్తా.

– సిరిగాది లక్ష్మయ్య, ఆదర్శ చేనేత సొసైటీ సిద్దిపేట

చాలా సంతోషంగా ఉంది



రామప్ప చీరతో..

నేను నేసిన రామప్ప చీరకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. 50 ఏళ్లుగా ఇదే వృత్తిలో జీవనం సాగిస్తున్న. గతంలో గొల్లభామ, పోచంపల్లి, ఘరానా చీరలు నేసిన. కొత్తగా ఏదైనా నేయాలని ఏడు రోజులు కష్టపడి రామప్ప కాటన్ చీర తయారీ చేసిన దీన్ని కూడా జకార్డు మగ్గం మీద నేయొచ్చు. ప్రభుత్వం మాలాంటి పేద చేనేత కార్మికులకు సాయం చేయాలి.

– బుగ్గ శ్రీరాములు, ఇర్కోడ్ చేనేత సొసైటీ సిద్దిపేట

చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి

– మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దుబ్బాక : కులవృత్తికి ఆదరణ కరువై ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్న చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్, నాయకులు మల్లుగారి రాంచంద్రారెడ్డి, తునికి సురేశ్ హైదరాబాద్‌లో మంత్రిని కలిసి దుబ్బాక చేనేత తకార్మికులు తయారు చేసిన వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు కార్మికుల కష్టాలను మంత్రికి వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి చేనే తకార్మికులకు చేతినిండా పని కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భర్త కళ్లెదుటే భార్య మృతి

- బైక్‌ను ఢీకొట్టిన మోటారు సైకిలిస్టు
- కొల్చారం, చిలప్‌చెడ్‌లో ఆటోలు అదుపుతప్పి ఇద్దరు
- మరోచోట కుక్కను తప్పించబోయి ఒకరు

జహీరాబాద్ టౌన్: దంపతులు బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త, కూతురికి గాయాలయ్యాయి. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం మేరకు.. న్యాల్‌కల్ మండలంలోని రాంతీర్థానికి చెందిన సిద్దు(36) టైలర్ పని చేస్తూ జహీరాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. కర్నాటక రాష్ట్రంలోని మన్నెకల్లి గ్రామంలో బంధువుల వద్ద ఫంక్షన్‌కు హాజరై భారత్ ఫైనాన్స్ ఇన్‌క్లూసిన్ బ్యాంక్‌లో డబ్బు డ్రా చేసుకునేందుకు భార్య అంబిక(30), కూతురు తేజస్విని(2)తో కలిసి మోటారు బైక్‌పై వెళ్లాడు. తిరిగి జహీరాబాద్ పట్టణానికి వస్తుండగా జాతీయ రహదారిపై సత్వార్ గ్రామ శివారులో వెనుకాల నుంచి వేగంగా హైదరాబాద్ వైపు వెళ్తున్న మోటారు సైకిలిస్టు వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అంబిక తలపగలి అక్కడికక్కడే మృతి చెందింది. సిద్దు, అతడి కూతురికి గాయాలయ్యాయి. మోటారు సైకిలిస్టు కూడా స్వల్పగాయాలయ్యాయి. ఎస్‌ఐ.రాజేందర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను తప్పించబోయి వ్యక్తి..

కొమురవెల్లి(సిద్దిపేట): ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేకు.. కిష్టంపేట గ్రామానికి చెందిన మాదాసు శ్రీహరి(31) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు రోజుల కిందట ఫోన్ పాడైపోగా రిపేర్ కోసం మంగళవారం రాత్రి చేర్యాలకు అతడి బావమరిది రాజుతో బైక్‌పై వెళ్లాడు. అనంతరం దొమ్మాట నవీన్, మాదాసు నవీన్‌తో కలిసి ముస్త్యాలలోని బంధువుల ఇంటికి పుట్టినరోజు ఫంక్షన్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చేర్యాలలోని ఓ బార్‌లో మద్యం సేవించారు. రాత్రి 11 గంటల సమయంలో బైక్‌పై దొమ్మాట నవీన్‌తో కలసి కిష్టంపేటకు బయలు దేరాడు. గురిజకుంట బ్రిడ్జి సమీపంలో కుక్కను తప్పించబోయి ఇద్దరూ కిందపడగా శ్రీహరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెనుక వస్తున్న రాజు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య మాదాసు చైతన్య ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

మిషన్ భగీరథ కంచెను ఆటోతో ఢీకొని..



ఆటోలోనే ప్రాణాలు వదిలిన శంకర్

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మెదక్–జోగిపేట రహదారి వరిగుంతం బస్ గేటు వద్ద బుధవారం చోటు చేసుకుంది. కొల్చారం ఏఎస్‌ఐ తారా సింగ్ కథనం మేరకు.. పాపన్నపేట మండలం అసన్ మహమ్మద్ గ్రామానికి చెందిన నీలగిరి శంకర్ (38) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆటో పాడవడంతో రిపేర్ కోసం మెదక్ వెళ్తున్నాడు. అతివేగంగా నడుపుకుంటూ వెళ్తూ వరిగుంతం బస్ గేటు వద్ద రోడ్డుకు పక్కన ఉన్న మిషన్ భగీరథ పైపు లైన్ వాల్వుకు రక్షణగా వేసిన ఇనుప కంచెను ఢీకొట్టాడు. ఆటో ముందు భాగం దెబ్బతిని శంకర్ అందులోనే తీవ్ర గాయాలతో చనిపోయాడు. మృతుడి కుమారుడు నితిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా ఒకరు..

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆటో బోల్తా పడటంతో వృద్ధుడు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఏఎస్‌ఐ మిస్బావొద్దీన్ కథనం మేరకు.. మండలంలోని గణ్యతండా పంచాయతీ మల్లక్క చెరువు తండాకు చెందిన రాట్ల మోజ్యానాయక్(70) పొలానికి వేసే గడ్డిమందు కోసం చిలప్‌చెడ్‌కు సిద్ధం అయ్యాడు. అతడి కొడుకు గంగ్య బైక్‌పై గౌతాపూర్ వరకు దించి వెళ్లాడు. గౌతాపూర్‌లో మోజ్యానాయక్ ఆటో ఎక్కడగా డ్రైవర్ గోపాల్ అతివేగంగా నడపడంతో గుజిరితండా శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో మోజ్యానాయక్ అక్కడికక్కడే మృతిచెెదాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ గోపాల్‌తోపాటు మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మృతుడి కొడుకు గంగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక పెళ్లి కేసు రీ ఓపెన్

జోగిపేట(అందోల్): బాలిక పెళ్లి కేసును రీ ఓపెన్ చేయాలని కోర్టు తీర్పునివ్వడంతో ఎస్పీ ఆ కేసుకు సంబంధించి విచారణ జరపాలని జోగిపేట సీఐకి ఆదేశించారు. ఈ కేసుకు వివరాలను సీఐ అనిల్‌కుమార్ తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. అల్మాయిపేట గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(26)తో అమీన్‌పూర్ ప్రాంతానికి చెందిన బాలిక (16)ను ఇచ్చి 2023 డిసెంబర్ 10వ తేదీన వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా సీడబ్ల్యూసీ అధికారులు అడ్డుకున్నారు. ఇరు కుటుంబాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా వారు పట్టించుకోకుండా అదే నెలలో అందోలు శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పెళ్లి జరిపించారు. ఈ పెళ్లికి సంబంధించి వీడియోను సీడబ్ల్యూసీ అధికారులకు పంపగా వారు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక కాదని మేజర్ అని స్కూల్ బోనాఫైడ్ సర్టిఫికెట్ జారీ చేయగా, సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఓకే చేశారు. కోర్టులో కూడా బాలిక 2005లోనే జన్మించినట్లుగా వాంగ్మూలం ఇచ్చింది. దీంతో అప్పట్లో సీఐగా పనిచేస్తున్న నాగరాజు కేసును మూసివేశారు.

కోర్టును ఆశ్రయించి సీడబ్ల్యూసీ..

ఈ కేసుకు సంబంధించి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాజిరెడ్డి కోర్టును ఆశ్రయించారు. అమ్మాయి మేజర్ కాదని, మైనర్‌యని పిటిషన్ దాఖలు చేయడంతో విచారణకు ఎస్పీని ఆదేశిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసును రీఓపెన్ చేయాలని సీఐని ఎస్పీ ఆదేశించడంతో తిరిగి విచారణ ప్రారంభించారు. సీడబ్ల్యూసీ అధికారులు వయస్సు నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 16 ఏళ్లకు తక్కువగా ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. అలాగే పాఠశాలలకు చెందిన రికార్డులు పరిశీలించగా 2009వ సంవత్సరంలో జన్మించినట్లు రికార్డులో ఉంది. ఈ కేసులో నిందితుడు నవీన్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు. జోగిపేట మున్సిఫ్‌కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో అధికారులు

వట్‌పల్లి(అందోల్): మూడు కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరిండెంట్ కే.శ్రీనివాసరావు కథనం మేరకు.. గంజాయి తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి అందోలు మండలం డాకూరు గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. వట్‌పల్లి మండలం గౌతాపూర్ వాసి దొడ్లె మోయిద్దీన్ బైక్ తనిఖీ చేయగా 3 కిలోల 50 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. వెంటనే గంజాయి స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నాం. గంజాయి విలువ సుమారుగా రూ.1.80 లక్షల వరకు ఉంటుంది. నిందితుడిని జోగిపేట సబ్‌జైల్‌కు రిమాండ్‌కు పంపినట్లు శ్రీనివాసరావు తెలిపారు.తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్, హెచ్‌సీ అలీం, సిబ్బంది రామారావు నాయక్, డీ.మల్కయ్య, కే.ఏ సతీష్ మోహన్, ప్రవీణ్‌రెడ్డి, వివేక్ పాల్గొన్నారు. బైక్‌పై ఇద్దరు యువకులు ఉన్నారని, అందులో ఇద్దరు తప్పించుకొని పారిపోయినట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నిందితుడి వెంట ఉన్న మరో వ్యక్తిని తప్పించారా? లేక అధికారులే వదిలేశారా అన్న అనుమానాల్ని స్థానికులు వ్యక్త పరుస్తున్నారు. ఈ విషయమై శ్రీనివాసరావును వివరణ కోరగా మోయిద్దీన్‌ను కస్టడీకి తీసుకొని విచారణ జరుపనున్నట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం, ఇసుక స్వాధీనం..

నంగునూరు(సిద్దిపేట): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంతోపాటు మూడు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసీఫ్ తెలిపారు. పాలమాకుల శివారులో రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటాఏస్ వాహనంలో తరలిస్తున్న 5 టన్నుల బియ్యాన్ని పట్టుకొని డ్రైవర్ వంగ నగేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు. అలాగే అక్కెనపల్లి పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఖాతా గ్రామ శివారులో పట్టుకొని డ్రైవర్లు చల్లా సత్తిరెడ్డి, సందిటి ప్రవీన్, పోతిరెడ్డి తిరుపతిపై సుమోటో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై విజయ్‌భాస్కర్ కథనం మేరకు.. హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌కు చెందిన భాస్కర్ సుమారుగా 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా మల్లంపల్లి గ్రామంలో పట్టుకున్నాం. ఆటో, బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వ్యక్తి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వీడ్ని ఎన్ని రోజులు భరిస్తాం

- మానసిక కుమారుడిని హత్య చేసిన తండ్రి
- తాగిన మైకంలో రోకలిబండతో దాడి
- పెద్దశంకరంపేటలో ఘటన



సాయిలు (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): సపర్యలు చేయలేక మానసిక వికలాంగుడైన కుమారుడిని ఓ తండ్రి దారుణంగా హత్య చేశాడు. హృదయ విదారకమైన ఈ సంఘటన మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దశంకరంపేటలోని ఇందిరాకాలనీకి చెందిన పిర్లైనోల్ల సాయిలు, భూమమ్మలకు ప్రశాంత్, ప్రదీప్ (16) ఇద్దరు సంతానం. ప్రశాంత్‌కు వివాహం కాగా, పక్క పోర్షన్‌లో నివాసం ఉంటున్నాడు. చిన్నకుమారుడు ప్రదీప్(16) మానసిక వికలాంగుడు. సాయిలు హమాలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రదీప్ మానసిక వికలాంగుడు కావడంతో అతనికి ప్రతిరోజు తండ్రి సపర్యలు చేసేవాడు. పనిచేయనిదే పూట గడవని ఆ కుటుంబంలో ఇదో పెద్ద సమస్యగా మారింది. కొడుకును సాకలేక.. సపర్యలు చేయలేక సాయిలు విసుగుచెందేవాడు. నిత్యం ఈ బాధలు భరించలేక కొడుకును అంతమొందిస్తేనే ప్రశాంతత ఉంటుందని సాయిలు భావించేవాడు. 'వీడిని ఎన్ని రోజులు భరిస్తాం' అని తరచూ ఇంట్లో కూడా గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం మద్యం సేవించాడు. తాగిన మైకంలో విచక్షణ కోల్పోయి కుమారుడిపై రోకలిబండతో దాడి చేశాడు. దీంతో ప్రదీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డుకోబోయిన తల్లిని నెట్టివేశాడు. విషయం తెలిసిన మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పెద్దశంకరంపేట ఎస్‌ఐ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. నిందితుడు సాయిలును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా మృతుడి తాత పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తండ్రిని చంపిన కుమారుడు

మద్యం సేవించి వేధిస్తున్నాడని హత్య



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కోహెడరూరల్(హుస్నాబాద్): వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మండలంలోని వరికోలు గ్రామంలో చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎండీ (ఫకీర్) నబీ(50) మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. కొంత కాలంగా భార్య బిపాష, కుమారుడు జావీద్‌కి దూరంగా హైదరాబాద్‌లో ఫకీరు పని చేస్తూ దుకాణాల్లో పొగ(ఊదు) వేస్తూ వచ్చిన డబ్బులతో జీవిస్తున్నాడు. ఇటీవల కూతురికి వివాహం జరుగగా భార్య, కుమారుడు సైతం గ్రామం నుంచి వెళ్లి హైదరాబాద్‌లోనే అతడికి దూరంగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి నబీ మద్యం మత్తులో వారు ఉండే చోటుకు వెళ్లి వేరే వాళ్లవి రెండు ఆటోలను ధ్వంసం చేసి భార్యాకుమారుడిపై దాడికి దిగాడు. విసిగిపోయిన బిపాష, జావీద్ వాహనంలో నబీని తాడుతో కట్టి స్వగ్రామం వరికోలుకి తీసుకొచ్చారు. తరచూ గొడవలు పడుతూ హింసిస్తున్నాడని కోపంతో గ్రామ శివారులోని ముస్లిం సమాధుల వద్ద గొంతు నులిమి హత్య చేసినట్టు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ఉదయం అటుగా వెళ్తున్న ఓ పశువుల వ్యాపారి మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ తిరుపతి ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీం ద్వారా హత్య ప్రదేశంలో ఉన్న రక్తపు మరకలు, మద్య సీసాలు పరిశీలించారు. తండ్రిని తానే హత్య చేసినట్టు కుమారుడు జావిద్ పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

– ప్రధాన నిందితుడు పరారీలో..

తూప్రాన్: చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ శివానందం బుధవారం పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. జులై 9న నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు రాజధాని బస్సులో ప్రయాణిస్తున్న అమీన్ అబ్దుల్ లాలని అనే ప్రయాణికుడి రూ.5 లక్షల బ్యాగ్‌ను పట్టణ సమీపంలోని దాబా హోటల్ వద్ద బస్సు నిలిపిన సమయంలో కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి నిందితులను పట్టుకున్నారు. ఇందులో మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన సురాజ్ పండిత్, సంతోష్ సయాబ్‌రావు,సునీల్ అర్జున్‌జాదవ్ ఉన్నారు. ప్రధాన నిందితుడు సునీల్ పండిత్ పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.